



దప్పు కళాకారుల నూతన కమిటీ సభ్యులు

దప్పు కళాకారుల సమస్యలపై పోరాటం

ముగిసిన జిల్లా మహాసభలు - నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

దప్పు కళాకారుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తు పోరాటాలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ బాబు పేర్కొన్నారు. పుట్టపర్తిలో జరుగుతున్న దప్పు కళాకారుల రెండవ జిల్లా మహాసభ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆనంద్ బాబు మాట్లాడుతూ ప్రతి దప్పు కళాకారులకు కూటమి ప్రభుత్వం ఆన్లైన్ నమోదుకు ఆదేశాలు ఇవ్వాలన్నారు. కళాకారులకు నైపుణ్య శిక్షణ తరగతులు రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించి, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. కళాకారులకు మూడు సెంట్లు ఇంటి స్థలంతో పాటు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. కుటుంబానికి మూడు ఎకరాలు ప్రభుత్వ భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఇస్తున్న దప్పు కళాకారుల పింఛన్ రూ.7వేలకు పెంచాలన్నారు. వీటి కోసం భవిష్యత్తులో ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు.

నూతన సంఘం ఎన్నిక

మహాసభల సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా దప్పుకళాకారుల నూతన సంఘాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా తలమర్ల రామాంజినేయులు, ప్రధాన కార్యదర్శిగా హనుమయ్య, ఉపాధ్యక్షులుగా వెంకట రాముడు, పి.నరసింహులు, బాబయ్య, సహాయ కార్యదర్శులుగా బాలు, రామచంద్రతో పాటు 25 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు తలమర్ల రామాంజినేయులు, హనుమయ్య మాట్లాడుతూ జిల్లాలో దప్పు కళాకారుల సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తామని తెలియజేశారు.



కాలవ శ్రీనివాసులు



ఎంఎస్.రాజు

టిడిపికి కొత్త అధ్యక్షులు

అనంతకు కాలవ.. హిందూపురానికి రాజు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

తెలుగుదేశం పార్టీ అధిష్టానం పార్లమెంటరీ నియోజకవర్గం కొత్త అధ్యక్షులు నియామకాలను చేపట్టింది. ఇందులో భాగంగా ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి అనంతపురం, హిందూపురం పార్లమెంట్ స్థానాలకు అధ్యక్షుడి నియామకం జరిగింది. తెలుగుదేశం పార్టీ అనంతపురం పార్లమెంటరీ అధ్యక్షులుగా రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, టిడిపి హిందూపురం పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షులుగా మడకశిర ఎమ్మెల్యే, టిడిపి బోర్డు కమిటీ సభ్యులు ఎంఎస్.రాజులను నియమిస్తూ ఆ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో అనంతపురం పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షులుగా వెంకట శివుడు యాదవ్, హిందూపురం పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షులుగా వడ్డే అంజినప్పలు పని చేశారు. వీరిద్దరూ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నియమించబ్డారు. ప్రస్తుతం రెండు జిల్లాల అధ్యక్షులుగా నియమితులైన వారు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. కాగా అనంతపురం జిల్లా అధ్యక్షులు పని చేసిన వెంకట శివుడు యాదవ్‌కు కార్మిక సంక్షేమ శాఖ బోర్డ్ ఛైర్మన్‌గా ప్రభుత్వం నామినేటెడ్ పదవిని కల్పించింది. హిందూపురం పార్లమెంట్ అధ్యక్షులు వడ్డే అంజినప్పకు మాత్రం ఎలాంటి నామినేటెడ్ పదవి ఇంకా ఇవ్వలేదు. రెండు జిల్లాలకు కొత్త అధ్యక్షులుగా నియమితులైన కాలవ శ్రీనివాసులు, ఎంఎస్.రాజులు మూడేసి బాధ్యతలు నిర్వర్తించనున్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా పార్టీని బలోపేతం చేసుకోవడంలో భాగంగా అధ్యక్షుల మార్పునకు టిడిపి అధిష్టానం శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. అనంతపురం జిల్లా అధ్యక్షులుగా నియమితులైన కాలవ శ్రీనివాసులు పొలిట్ బ్యూరో సభ్యులుగా, ఉమ్మడి జిల్లాకు మాజీ అధ్యక్షులు పని చేశారు. పార్టీని కష్ట కాలంలోనూ సమర్ధవంతంగా నడిపించగలిగారు. అందుకోసమే మరోసారి ఆయనకే అనంతపురం జిల్లా పగ్గాలను అధిష్టానం అప్పగించింది. హిందూపురం పార్లమెంట్ అధ్యక్షులుగా నియమితులైన ఎమ్మెల్యే ఎంఎస్.రాజు యువకుడు ఉత్సాహ వంతుడిగా పార్టీలో గుర్తింపు తెచ్చుకున్నారు. అందరిని కలుపుకుని పార్టీని ముందుకు తీసుకెళ్లడంతో ఈయన కృషి చేస్తారన్న నమ్మకంతో అధ్యక్షుడి బాధ్యతను అప్పగించినట్లు తెలుస్తోంది.

ఉద్యోగోన్నతిపై హైకోర్టు అక్షింతలు

- స్పందించిన ఆర్‌డి
- కార్పొరేషన్ అధికారుల తీరుపై ఆగ్రహం
- అడ్డుగోలు ఉద్యోగోన్నతులను రద్దు చేయాలంటూ ఆదేశం



ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ విభాగంలో ఓ ఉద్యోగి ఉద్యోగోన్నతి అంశం తీవ్ర చర్చనీయంశం అవుతోంది. బాధితుడు న్యాయం కోసం కోర్టును ఆశ్రయించడంతో నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగోన్నతి కల్పించడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తక్షణం ఈ ఉద్యోగోన్నతిని రద్దుచేసి సమాచారం పంపాలని మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ నాగరాజును ఆదేశించింది. ఉద్యోగోన్నతి అంశంలో బిల్ కలెక్టర్ లక్ష్మీనరసింహమూర్తికి ఇవ్వడాన్ని అతని కంటే సీనియార్టీ జాబితాలో ముందున్న హర్షవర్ధన్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఉన్నతాధికారుల ఉత్తర్వులను ఖాతరు చేస్తూ బిల్ కలెక్టర్ హర్షవర్ధన్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించడంపై కొందరు అధికారుల ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయన్ను పలు రకాల బెదిరింపులకు గురి చేసినట్లు తెలుస్తోంది. అయినా హర్షవర్ధన్ బెదరక హైకోర్టులో న్యాయం, తన హక్కుల కోసం న్యాయపోరాటం చేశారు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపిన కోర్టు పిటిషనర్ సమర్పించిన రికార్డులను పరిశీలించి ఆదేశాలు ఇచ్చారు. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో బిల్ కలెక్టర్ లక్ష్మీ నరసింహమూర్తికి జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి కల్పించటం అక్రమంగా తేల్చింది. కమిషనర్ బాలస్వామి పేరుతో జారీచేసిన ఉద్యోగోన్నతి ఉత్తర్వులను ఎలాంటి నోటీసు ఇవ్వకుండానే రద్దు చేయాలంటూ ఆదేశించింది. ఉద్యోగోన్నతి పొందిన లక్ష్మీనరసింహమూర్తిని బిల్ కలెక్టర్‌గా రివర్షన్ ఇవ్వాలని కోర్టు ఆదేశించింది.

ఆర్డీ ఆగ్రహం

హైకోర్టు నుంచి ఉత్తర్వులు రావడంతో రీజినల్ డైరెక్టర్ నాగరాజు సోమవారం సాయంకాలం ఉద్యోగోన్నతి ఉత్తర్వులను రద్దుచేసి బిల్ కలెక్టర్‌గా నరసింహామూర్తిని నియమించాలని కమిషనర్ బాలస్వామిని ఆదేశించారు. ఇదే విషయాన్ని మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ కార్యాలయానికి సమాచారం పంపాలని ఆదేశించారు. ఇష్టారాజ్యంగా ఉద్యోగోన్నతులు కల్పించిన అధికారుల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. నిబంధనావళికి విరుద్ధంగా సీనియార్టీ జాబితాను పరిగణలోకి తీసుకోకుండా ఇష్టారాజ్యంగా ఉద్యోగోన్నతులు ఎలా కల్పించారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా మున్సిపల్ కార్పొరేషన్‌లో అడ్డగోలు ఉద్యోగోన్నతులు అంశంపై ఈ ఏడాది మే 16వ తేదీన ప్రజాశక్తి జిల్లా పేజీలో కథనం వెలువరించింది. అప్పట్లో ఈ వార్త కార్పొరేషన్‌లో పెద్ద చర్చకు దారి తీసింది.

కాసుల కక్కుర్తి..!

కార్పొరేషన్ ఉద్యోగోన్నతుల అంశంలో సీనియార్టీ జాబితాలను పరిగణలోకి తీసుకోకుండా కాసుల కక్కుర్తితో అప్పటి డిప్యూటీ కమిషనర్ కల్పించిన ఉద్యోగోన్నతి ఉత్తర్వులు అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల పనితీరుకు మాయని మచ్చగా మారింది. గతంలో సైతం ఇలాంటి అడ్డగోలు ఉద్యోగోన్నతులు కల్పించి సీనియార్టీ జాబితాలో సీనియర్లుగా ఉన్న వారికి తీరని అన్యాయం చేసిన ఘటనలు కార్పొరేషన్‌లో వెలుగు చూశాయి. ఉద్యోగోన్నతికి అన్ని విధాలా అర్హులై ఉన్నా కూడా దానిని పొందలేని వారు ఉన్నారు. దీనిపై వారు ప్రశ్నిస్తే ఉన్నతాధికారులు తమనెక్కడ ఇబ్బందులు పెడతారో అన్న భయంతో చాలా మంది మౌనంగా ఉండిపోయారు. ప్రస్తుతం హైకోర్టు ఇచ్చిన ఇచ్చిన ఆదేశాలతో గతంలో ఉద్యోగోన్నతుల్లో నష్టపోయిన వారందరికీ ధైర్యం వచ్చినట్లు అయ్యింది. అన్యాయం జరిగితే హక్కుల కోసం పోరాడడం మంచిదే అంటూ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగోన్నతుల విషయంలో సీనియార్టీ జాబితాలను పకడ్బందీగా తయారు చేసి, నిబంధనల మేరకు ఈ ప్రక్రియను నిర్వహించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

నేడు పెన్షనర్ల పండుగ

లలిత కళాపరిషత్‌లో పెన్షనర్స్ డే వేడుకలు



పెద్దన్న గౌడ్



జయరామప్ప

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఉద్యోగి సుధీర్ఘకాలంగా ప్రభుత్వ సర్వీసులో ఉన్నప్పుడు ఉద్యోగ బాధ్యతలు, సంసార బాధ్యతలతో తులమునకలై ఉంటారు. దాదాపు 30 నుంచి 35 సంవత్సరాల పాటు సుధీర్ఘంగా ప్రభుత్వ సేవలు అందించే ఉద్యోగులు ఉద్యోగవిరమణ అనంతరం పెన్షనర్లుగా కొత్త జీవితాన్ని ప్రారంభిస్తారు. రిటైర్ అయిన తరువాత సమాజంలో గౌరవం, భద్రతతో జీవనం సాగించేందుకు పెన్షన్ ఒక ముఖ్యమైన ఆధారం, ఆసరా. పెన్షన్ ప్రభుత్వం అందించే భరోసా, రాజ్యాంగం కల్పించిన హక్కు. ఈ హక్కును సుప్రీం కోర్టు చారిత్రాత్మకంగా తీర్పు వెలువడిన రోజు డిసెంబర్ 17న పెన్షన్‌దారుల దినోత్సవంగా పాటిస్తారు.

నేడు పెన్షనర్ల దినోత్సవ వేడుకలు

అధ్యక్ష, కార్యదర్శులు పెద్దన్న గౌడ్, జయరామప్ప

అనంతపురం జిల్లా కేంద్రంలోని లలిత కళాపరిషత్‌లో నిర్వహిస్తున్న అఖిల భారత పెన్షనర్ల దినోత్సవ కార్యక్రమంలో పెన్షనర్లు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆ సంఘం అధ్యక్ష, కార్యర్శులు బి.పెద్దన్న గౌడ్, శీలా జయరామప్పలు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్‌లకు టిడిపి కూటమి ప్రభుత్వంలో పెన్షన్లు అందుతున్నాయన్నారు. అయితే ఇంకా పెన్షనర్ల సమస్యలు చాలా వరకు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. 2018 నుంచి ఇప్పటి వరకు రావాల్సిన డిఆర్, 11వ పిఆర్‌సి బకాయిలు విడుదల కావాల్సి ఉందన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ సకాలంలో అందని పరిస్థితి ఉందన్నారు. మూడు మాసాల్లో ఇవ్వాల్సిన బెనిఫిట్స్ సంవత్సరాల తరబడి జాప్యం జరుగుతోందన్నారు. ఈహెచ్‌ఎస్ పథకం వైద్య సేవల పరిమితి రూ.2 లక్షల నుంచి పెంపుదల చేయాల్సి ఉందన్నారు. సకాలంలో మెడికల్ రీయింబర్స్‌మెంట్ అందేలా చూడాలని కోరారు. పెన్షనర్ల బకాయి డిఆర్‌లు తక్షణమే చెల్లించాలన్నారు. పెండింగ్ డిఆర్‌లు రెండు సంవత్సరాల తరువాత చెల్లించేందుకు ప్రభుత్వం జీవో ఇవ్వడం సరికాదన్నారు. పెన్షనర్ల హక్కుల సాధన కోసం కలిసొచ్చే వారితో నిరసనలు చేపట్టి గొంతెత్తుతామన్నారు.

టీచర్స్ క్రికెట్ టోర్నీ ఫైనల్‌కు రొద్దం జట్టు

ప్రజాశక్తి - రొద్దం

డివిజనల్ లెవెల్ టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్‌లోకి రొద్దం జట్టు ప్రవేశించింది. మంగళవారం హిందూపురం లో ఎం జి ఎం మైదానం లో నిర్వహించిన డివిజన్ లెవెల్ టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్లో రొద్దం జట్టు 13 పరుగుల తేడాతో హిందూపూరం టీచర్స్ టీం పై విజయం సాధించి ఫైనల్ లోకి ప్రవేశించిదని రొద్దం జట్టు కెప్టెన్ జి.సి. నరేష్ కుమార్ తెలిపారు. ఫైనల్ మ్యాచ్ పెనుకొండ గ్రౌండ్ లో మడకశిర టీంతో తలపడనున్నట్లు చెప్పారు.



ఫైనల్స్‌కు చేరిన రొద్దం జట్టు సభ్యులు

సొసైటీలను పటిష్టం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎల్. నరసింహులు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఆంధ్ర ప్రదేశ్ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం వ్యవస్థను బలోపేతం చేసి రైతులను, ఉద్యోగస్తులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సిఐటియు జిల్లా కార్యదర్శి జిఎల్ నరసింహులు అన్నారు. మంగళవారం పుట్టపర్తి ఏ డి సి సి బ్యాంక్ ఎదుట సహకార ఉద్యోగుల సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జీవో నెంబర్ 36 అమలు చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని ,2019-2024 వేతన సవరణ చేయాలని, గ్రాడ్యుటీ అమలు చేయాలని రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, 2019 తర్వాత చేరిన ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, సొసైటీ లాభనష్టాలతో సంబంధం లేకుండా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగానికి వెన్నెముకగా ఉన్న సహకార సంఘాలను బలోపేతం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల సమస్యలతో పాటు రైతుల సమస్యలను కూడా పరిష్కరించాలన్నారు. చిన్న సన్న కారు రైతులకు వెన్నెముకగా ఉన్న సహకార వ్యవస్థను పటిష్టం చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ధర్నా అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కో-ఆపరేటివ్ అధికారి కృష్ణనాయక్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు జిఎల్ నరసింహులు, అధ్యక్ష కార్యదర్శులు ఆంజనేయులు, హరికృష్ణ,కన్వీనర్ ప్రతాప్ రెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి పైపల్లి గంగాధర్, యూనియన్ నాయకులు హనుమంత్ రెడ్డి, దామోదర, అన్వర్, రామాంజి, భారతి, నాగవేణి తదితరులు పాల్గొన్నారు. ఈ ధర్నాకు కోఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీరాములు, లీలావతమ్మ, ఏ డి సి సి బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ నాయకురాలు సుమిత సంఘీభావం తెలిపారు.

'ఉపాధి'ని నిర్వీర్యం చేసే కుట్ర :వ్యకాసం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నాయని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు విమర్శించారు. ఈ నేపథ్యంలో ఈపథకానికి సంబందించి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో కాపీలను మంగళవారం గణేష్ కూడలిలో దగ్ధం చేశారు. ఈ సందర్భంగాగా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ఫిరంగి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఇప్పటికీ సగటున 50 రోజులకు మించి ఉపాధి పనులు కల్పించడం లేదన్నారు. గ్రామీణ ప్రాంతాలలో వలసలు నివారించలేకపోతున్నారని, వలసలు నివారించాలంటే 200 రోజులు పనులు కల్పించాలని నేటి ధరలకు అనుగుణంగా 600 రూపాయలు వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొస్తున్న అజివీక్ మిషన్ (గ్రామీణ) 2025 బిల్లు పార్లమెంట్లో ప్రవేశపెట్టడం మహాత్మ గాంధీ పేరును తొలగించటం చాలా బాధాకరమన్నారు. పథకంలో కేంద్రం వాటా 60శాతం, రాష్ట్ర ప్రభుత్వ వాటా 40 శాతం చేయడం చాలా అన్యాయమన్నారు. ఇప్పటివరకు కేంద్రం ప్రభుత్వం వాటా 90శాతం ఉండగా రాష్ట్ర ప్రభుత్వ వాటా పది శాతం మాత్రమే ఉండేదన్నారు. గ్రామీణ ప్రాంతాలలో వలసలు నివారించడానికి కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఈ కొత్త పథకం ద్వారా తెలుస్తుందన్నారు. ఈ కొత్త బిల్లులో 125 రోజులు పని పెంచుతున్నట్లు చెప్పి 60 రోజులు పని నిషేధం విధించారని వ్యవసాయ సీజన్ లో రైతులకు కూలీల కొరత లేకుండా ,రైతుల ముసుగు తగిలించారని విమర్శించారు . పనులను నాలుగు రకాలుగా విభజించి కోట్ల రూపాయల పనులకు యంత్రాలు కాంట్రాక్టర్లు కోసమే తీసుకొస్తున్నారన్నారు. పాత పద్ధతిలోనే మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఉండాలని డిమాండ్ చేశారు. ఉద్దేశపూర్వకంగానే పేదలకు ఉపాధి హామీ పథకాన్ని దూరం చేయాలని కుట్రలో భాగంగా ఈ చట్టాన్ని తీసుకొచ్చారని విమర్శించారు. ఈ కొత్త బిల్లులకు వ్యతిరేకంగా కడపలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగధర్, వ్యవసాయ కార్మికులు నరసింహ, గిరి, శంకర్, ఆది, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న నాయకులు

సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో మెరుగైన సేవలు : జేసీ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లాలోని సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించి, ప్రభుత్వ సేవలపై ప్రజల్లో సానుకూల అవగాహన పెంచాలని జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్ ఆదేశించారు.మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా సబ్ రిజిస్టర్ కార్యాలయాల పనితీరు, సేవల అమలుపై జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన సబ్ రిజిస్ట్రార్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ కలెక్టర్ మాట్లాడుతూ సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ సేవలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కలిగించేలా ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. హెల్ప్‌డెస్క్ ద్వారా కార్యాలయంలో అందించే అన్ని సేవలపై సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజలు మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా కార్యాలయ సిబ్బంది లేదా హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించే విధంగా అవగాహన పెంచాలని అన్నారు. ప్రభుత్వ సేవలను మరింత పారదర్శకంగా, ప్రజలకు అనుకూలంగా అమలు చేయాలని చెప్పారు. అనంతరం వివిధ అంశాలపై సమీక్షించి, అవసరమైన చర్యలపై అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. ఈ సమావేశంలో జిల్లా రిజిస్ట్రార్ క్రిష్ణకుమారి, సబ్ రిజిస్ట్రార్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

'హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాల్సిందే'



ఐక్యతను ప్రదర్శిస్తున్న విద్యార్థిసంఘాల నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

అన్ని అర్హతలు ఉన్న హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాల్సిందేనని ఐక్య విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఇందిరా పార్కులో జిల్లా సాధన పై ఐక్య విద్యార్థి సంఘం నాయకులు సమావేశమయ్యారు. ఎస్ఎఫ్ఐ, వైయస్సార్ ఎస్.యూ, పిడిఎస్‌యు, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యుఐ, ఏఐఎస్‌బి, ఎంఎస్ఎఫ నాయకులు సమావేశమై జిల్లా కేంద్రం సాధన పై చర్చించారు. జిల్లా కేంద్రం సాధన కోసం ఈ నెల 19వ తేదీన పెద్ద ఎత్తున విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శన ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో పాల్గొన్న హిందూపురం జిల్లా సాధన సమితి గౌరవాధ్యక్షులు ఉమర్ ఫారుక్, ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు బాబావలి, కదిరిష్, నరసింహమూర్తి, భరత్, చంద్ర, అఫ్రీద్ మాట్లాడుతూ అన్ని రకాలుగా అభివృద్ధి చెందిన హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో హిందూపురాన్ని ప్రత్యేక జిల్లా చేయాలని కోరుతూ హిందూపురం డివిజన్ వ్యాప్తంగా అన్ని కళాశాలలో సదస్సులు, సెమినార్లు, సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. దానితోపాటు ఈనెల 19వ తేదీన అన్ని విద్యార్థి సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే కలిసి వచ్చే వారిని అందరిని కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు అతిక్ మహమ్మద్, ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు యశ్వంత్, నాగేంద్ర, వంశీ, ఫణీంద్ర,అనుదీప్, నాజీర్, అజయ్, సుభాన్, ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యసేవలు పొందడానికి వచ్చిన గ్రామస్తులతో డాక్టర్ సాహితి

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

ప్రజాశక్తి - లేపాక్షి

మండల పరిధిలోని కొండూరు గ్రామంలోనిగంగమ్మ గుడి దగ్గర మంగళవారం ఉచిత మెగా ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దాదాపు 150 మందికి ఈసందర్భంగా పరీక్షలు నిర్వహించారు. మధుమేహం, రక్తపోటు, కీళ్లవాతం, మోకాళ్ళ నొప్పులు, చర్మవ్యాధులు, ఆస్తమా, అలర్జీ, స్త్రీ సంబంధిత వ్యాధులు, దగ్గు, జలుబు, అజీర్ణం, గ్యాస్, సయాటికా, మొలలు వంటి వ్యాధులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారిని డాక్టర్ సాహితి , కాంపౌండర్ ఇరగం రెడ్డి, యోగా శిక్షకురాలు కృష్ణవేణి, ఆశా వర్కర్లు లలిత, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

హెలిప్యాడ్‌కు స్థల పరిశీలన

ప్రజాశక్తి - మడకశిర రూరల్

మండల పరిధిలోని కల్లుమర్రి హై స్కూల్ ప్రాంగణంలో హెలికాప్టర్ ల్యాండింగ్ స్థలాన్ని పెనుగొండ డి.ఎస్.పి నర్సింగరావు అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ఆదేశాలతో జువ్వలజీ సర్వే కోసం ఆరు నెలలు పాటు నిర్వహించే హెలి సర్వే కోసం హెలికాప్టర్ ల్యాండింగ్ స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమానికి కల్లుమర్రి సర్పంచి నాగరాజ్, ఆర్అండ్‌బి డిఇ లక్ష్మీనారాయణ, సిఐ సుబ్రహ్మణ్యం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



హెలిప్యాడ్ స్థల పరిశీలనలో డీఎస్పీ తదితరులు



పోస్టరు విడుదల చేస్తున్న జేసీ, తదితరులు

జాతీయ వినియోగదారుల దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జాతీయ వినియోగదారుల దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని స్థానిక జేసీ ఛాంబర్‌లో పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు, ఈనెల 18 నుండి 24 వరకు నిర్వహించే వారోత్సవాల పోస్టర్ల విడుదల కార్యాక్రమంలో జేసీ మౌర్యభరద్వాజ్, జిల్లా పౌరసరఫరా శాఖ అధికారి వంశీకృష్ణారెడ్డి, జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షులు సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - ముదిగుబ్బ

ముదిగుబ్బ పరిధిలోని పులివెందుల రోడ్డు అంబకపల్లి క్రాస్ సమీపంలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్ర గాయాలపాలయ్యారు. మండల కేంద్రంలోని దొరిగిల్లు రోడ్డులో నివాసం ఉంటున్న శ్రీకాంత్, గణేష్ క్రికెట్ ఆడటానికి మంగళవారం ఉదయం 10గంటల సమయంలో తమ ద్విచక్ర వాహనములో ముదిగుబ్బ నుంచి ఎగువపల్లి గ్రామానికి వెళుతున్నారు. వీరి వాహనం పులివెందుల హూట్ రోడ్లో ఎదురుగా వస్తున్న కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీకాంత్, గణేష్ తీవ్రంగా గాయపడ్డారు.వీరిని చికిత్స నిమిత్తం ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు.

డ్రైవర్‌కు గాయాలు..

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండల పరిధిలోని గంటాపురం క్రాస్ వద్ద అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. తమిళనాడులోని క్రిష్ణగిరికి చెందిన బొలెరో వాహనం అనంతపురానికి బొప్పాయి కాయలలోడుతో వస్తోంది. గంటాపురం క్రాస్ వద్దకు రాగానే నిలిపి ఉన్న ఐచర్ను వెనుక వైపు బొలెరో ఢీ కొంది. ఈ ప్రమాదంలో బొలెరో వాహనం డ్రైవర్ మాదేశన్ తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలిసిన వెంటనే బత్తలపల్లి పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు.

మహిళ అదృశ్యం

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండలంలోని ఓబుళాపురం గ్రామానికి చెందిన వివాహిత ఐదు నెలలుగా కనిపించకుండా. పోయిందని ఆమె తల్లి జయమ్మ బత్తలపల్లి పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసింది. గ్రామానికి చెందిన దండు జయమ్మ నాల్గవ కుమార్తె రవళిని పెనుకొండ మండలం వేతులూరిపల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులుతో వివాహం జరిపించారు. వీరికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. తల్లిని చూడాలని రవళి ఐదు నెలల క్రితం ఓబుళాపురానికి వచ్చింది. అనంతరం వేతులూరిపల్లికి తిరిగి వెలుతున్నట్లు ఇంటో చెప్పి వెళ్లిన రవళి ఎక్కడికో వెళ్లిపోయిందని ఆమె తల్లి తెలిపారు ఆచూకీ కోసం గాలించినా ప్రయోజనం లేకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం రూరల్ పరిధిలోని గన్నేవారిపల్లి కాలనీలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. గన్నేవారిపల్లి కాలనీలో లింగం సంజీవరాయుడు, సాయిసరళ(29) దంపతులు నివాసం ఉంటున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో సాయి సరళ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు తాడుతో ఉరి వేసుకొంది. గమనించిన స్థానికులు ఆమెను కిందకు దించి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సాయిసరళ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పేకాట జూదరులు అరెస్ట్

ప్రజాశక్తి-కుందుర్పి

పేకాట స్థావరంపై దాడి చేసి జూదరులను అరెస్టు చేసి నగదు, బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ నీలకంఠేశ్వర తెలిపారు. అందిన సమాచారం మేరకు మంగళవారం మండలంలోని ఎర్రగుంట సమీపంలో ఉన్న చింతరపల్లి ఫారెస్ట్‌లో దాడులు చేసి పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్టు చేశామన్నారు. వారి నుంచి రూ. 30,600నగదు, 2 బైక్‌లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

టిఫిన్ సెంటర్‌కు నిప్పు.. రూ. 50వేలు నష్టం

గుత్తి : గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో టిఫిన్ సెంటర్ కాలిపోయిన సంఘటన సోమవారం రాత్రి పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని గాంధీ కూడలి సమీపంలో శ్రీనివాసులు టిఫిన్ సెంటర్ నిర్వహిస్తూ జీవనం సాగించేవాడు. సోమవారం సాయంత్రం యధావిధిగా టిఫిన్ సెంటర్ బంద్ చేసి ఇంటికి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగి రెండు ఇడ్లీ బండ్లు, వంట పాత్రలు కాలిపోయాయి. దీంతో సుమారు రూ. 50 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. సమాచారం తెలుసుకున్న వైసిపి జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి, నాయకులు అక్కడికి వెళ్లి బాధితున్ని పరామర్శించి రూ. 10వేలు అందజేశారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ కన్వీనర్ కె.మధుసూదన్ రెడ్డి, నాయకులు సివి.రంగారెడ్డి, గురుప్రసాద్ యాదవ్, శివ తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మోడర్‌పేపర్లు పంపిణీ

ప్రజాశక్తి - లేపాక్షి

మండల పరిధిలోని కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు కల్లూరు గ్రామవాసి అయిన ఉపాధ్యాయులు అశ్వర్థ యుటిఎఫ్ తయారు చేసిన స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందచేశారు. ప్రధానోపాధ్యాయులు ప్రకాష్ ఆధ్వర్యంలో పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో యుాటీఎఫ్ ఆధ్వర్యంలో తయారు చేసిన మెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీరాములు, నాగరాజు, మున్వర్, రవికుమార్, శ్రీరాములు, మంజుల, వాణి, యుటిఎఫ్ నాయకులు సురేష్, క్షీరలింగేశ్వర, రమణ,ఆంజనేయులు, మురళి తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల : మండలంలోని అన్నిప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 10వ తరగతి స్టడీ మెటీరియల్‌ను మాజీ ఎంపీపీ నిమ్మల విద్యాధరణి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. అందులో భాగంగా గోరంట్ల మండలం బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు వాటిని మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈశ్వర్ ప్రసాద్,ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు మురళి, నగేష్, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.





లేపాక్షి, గోరంట్లలో పది మాదిరి పేపర్లతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

పర్యావరణానికి హాని కలిగించొద్దు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న గనుల వల్ల పర్యావరణానికి హాని కల్గించే విధంగా ఉన్నాయని వారు తీసుకున్న అనుమతులకు మించి మైనింగ్ చేస్తున్నారని వాటిని తక్షణమే సంబంధిత పరికరాలతో లెక్కించి పర్యావరణహితం కోసం చర్యలు చేపట్టాలని పర్యావరణ వేత్త డాక్టర్ భాస్కర్ నాయుడు కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం మైనింగ్ ఏడి అమీర్ భాషకు వినతి పత్రం అందజేశారు. అనంతరం భాస్కర్‌నాయుడు మాట్లాడుతూ దేశంలోనే రెండవ కరువు జిల్లా అయిన జిల్లాలో గనుల తవ్వకాలు యధేచ్ఛగా సాగుతునానయన్నారు. మారెమ్మ కనుమ వద్ద గల కృష్ణసాయి మైన్స్, నల్లమాడ సమీపంలో గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు నిర్వహణలో అక్రమ మైనింగ్, ముదిగుబ్బ ,బుక్కపట్నం హైవే రోడ్డులో అక్రమ మైనింగ్ తదితర రోడ్ మెటల్ గనులు చట్టాలకు విరుద్ధంగా నడుస్తున్నాయని ఆరోపించారు. ఇది స్థానిక ప్రజల ఆరోగ్యం, వ్యవసాయం, పర్యావరణానికి హాని కలిగిస్తోందన్నారు. ఇప్పటికే చాలాసార్లు ఈ విషయాన్ని మైనింగ్ అధికారుల దృష్టికి తీసుకు వచ్చామని ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కల్చర్, నేచర్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ పుట్టపర్తి మండల అధ్యక్షుడు గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న పర్యావరణవేత్త భాస్కర్‌నాయుడు, తదితరులు

పంటల సాగులో మెలకువలు తప్పనిసరి

ప్రజాశక్తి - కొత్తచెరువు

పంటల సాగులో రైతులు మెలకువలు తప్పనిసరిగా పాటించాలని ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ రామసుబ్బయ్య, జిల్లా వ్యవసాయ అధికారి కృష్ణయ్య తెలిపారు. మండల పరిధిలోని చెన్నరాసపల్లి గ్రామంలో తాడిపత్రికి చెందిన వ్యవసాయ కాలేజ్ విద్యార్థులతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం సాగు చేస్తున్న పంటలలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు ముఖ్యంగా ఉద్యాన పంటలైన మామిడి , జామ, సపోటా, ఆరంజ్, వీటిని సాగు చేసే రైతులు తెగుళ్ల రాకుండా ముందస్తుగా సకాలంలో మందులు పిచికారి చేయాలన్నారు. అలాగే భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. వేరుశనగ సాగు చేసే రైతులు తగిన మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు పొందచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సతీష్ బాబు, పాఠశాల హెచ్‌ఎం శేషగిరిరావు, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు



వినతిపత్రం అందజేస్తున్న మాజీ డీలర్లు

డీలర్ల కమీషన్ విడుదల చేయాలి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

రేషన్ డీలర్లకు బకాయి ఉన్న కమీషన్ వెంటనే విడుదల చేయాలని ధర్మవరం పట్టణ మాజీ రేషన్ దుకాణాల డీలర్లు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం ఆర్ డి ఓ కార్యాలయం లో రెవిన్యూ డివిజన్ అధికారి మహేష్‌ని కలసి తమకు రావలిసిన కమీషన్ బకాయిలపై వినతి పత్రాన్ని అందజేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2015 వ సంవత్సరం నుంచి 2023 వ సంవత్సరం వరకు కమీషన్ బకాయి ఉందన్నారు. అధికారులు స్పందించి తమకు రావాల్సిన కమీషన్ ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ రమేష్, రమాదేవి, టైలర్ కృష్ణ, కాంతమ్మ, కోళ్లమొరం కేశవరెడ్డి, బెస్తవెంకటరమణ, సబియా, పోతిరెడ్డి, అంకే నరసింహులు, దాసరి రాము, తిరుపాలు, శివుడు, పరశురామిరెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'సాదా బైనామా'పై గ్రామసభ

ప్రజాశక్తి - అమరాపురం

మండల పరిధిలోని హేమావతి గ్రామంలో సాదా బై నామ గ్రామసభను మంగళవారం నిర్వహించారు. వీఆర్వో మహేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో నాలుగు అర్జీలు రాగా అందులో సాదా బై నామ అర్జీలు రెండు ఇతర సమస్యలపై రెండు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈసందర్భంగా ఆర్ఐ విన్సెంట్ ఫాల్ మాట్లాడుతూ ఒక్క రూపాయి ఖర్చు కాకుండా జూన్ 2024వ తేదీ ముందు జరిగినటువంటి భూమి లావాదేవీలపై సమస్య ఉంటే ఈ గ్రామ సభ ద్వారా పరిష్కారం చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి తిప్పేస్వామి, ఎంపీటీసీ ఓంకార స్వామి, మా లింగప్ప, బీడీ నరసింహారాజు, కంకర తిప్పేస్వామి, హనుమంతగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో పాల్గొన్న అధికారులు

గ్రామ పంచాయతీ విభజనపై గ్రామసభ

ప్రజాశక్తి - తలుపుల

మండలంలోని వేపమానిపేట గ్రామ పంచాయతీ విభజనపై మంగళవారం లాగంజివారిపల్లిలో అధికారులు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ విభజనకు గ్రామస్తులు ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సంజీవ్, నాగలక్ష్మి, ఎంపీడీవో నసీమ, గ్రామపంచాయతీ కార్యదర్శి అధికారులు పాల్గొన్నారు.

డీలర్‌కు పరామర్శ

ప్రజాశక్తి -నంబులపూలకుంట

మండల పరిధిలోని గంగెద్దులవారిపల్లికి చెందిన స్టోర్ డీలర్ లక్ష్మీనారాయణ రెడ్డి అనారోగ్యంతో ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసరెడ్డి లక్ష్మినారాయణను మంగళవారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూముల పరిశీలన

ప్రజాశక్తి -నంబులపూలకుంట

మండల పరిధిలోని వంకమద్ది, వెలిచలమల, గ్రామాలలో నూతన సోలార్ కోసం సేకరించిన భూములను జేసీ మౌర్య భరద్వాజ్ మంగళవారం పరిశీలించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి మండలంలో నెలకొన్న సమస్యలపై అధికారులతో ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వివిఎస్ శర్మ , తహశీల్దార్ దేవేంద్ర నాయక్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి - అమడగూరు

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ సుమతి తెలిపారు.మంగళవారం మహమ్మాదాబాద్ మూడు రోడ్ల కూడలిలో వాహనాలు తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా వాహనాలకు సంబంధించి డ్రైవింగ్ లైసెన్స్, ఆర్ సి,లతో పాటు హెల్మెంట్ ధరించాలని వాహనదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ

ప్రజాశక్తి - నల్లమాడ

రబీలో వేరుశనగ పంటసాగు చేసే రైతులకు సబ్సిడీ ద్వారా విత్తన కాయలు సరఫరా చేస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి అబ్దుల్ హక్ తెలిపారు. 30 కేజీల బస్తా కాయలను రూ.1656 లకు అందిస్తామన్నారు. పట్టాదారు పాస్ పుస్తకం గల రైతులు సంబంధిత అగ్రికల్చర్ అసిస్టెంట్ వద్ద డబ్బులు చెల్లించి విత్తనకాయలు పొందవచ్చని చెప్పారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి - అమడగూరు

అమడగూరు పోలీసుస్టేషన్‌ను ఎస్పీ సతీష్ కుమార్ మంగళవారం తనిఖీ చేశారు, ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతలపై ఎస్ఐ సుమతితో చర్చించారు. స్టేషన్లో సిబ్బంది కొరత, ఉన్న సిబ్బందిపై అడిగి తెలుసుకున్నారు, మండలంలోని సమస్యలపై ఆరాతీశారు.ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు అన్ని కుటుంబాలతో సత్సంబంధాలు : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూర

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

గ్రామాల్లో పట్టణాల్లో ప్రతి కుటుంబంతో సత్సంబంధాలను కొనసాగిస్తూ వారి ఆర్థిక పరిస్థితులు వారి పిల్లల ఎదుగుదల గురించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు జవాబుదారీగా ఉండేవారే అంగన్వాడీ కార్యకర్తలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో పుట్టపర్తి నియోజకవర్గం 6 మండలాల అంగన్వాడీ కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ,మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, పాల్గొనగా ఐ సిపిడిఎస్ పిడి ప్రమీల ,సిడిపివోలు గాయత్రి, వరలక్ష్మి, జయంతి, మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి కృష్ణమూర్తి, మార్కెట్ యార్డ్ చైర్మన్ పూల శివప్రసాద్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పుట్టపర్తి ఎంఎల్ఏ పల్లె సింధూర రెడ్డి ,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా అంగన్వాడి కార్యకర్తలకు 5జీ మొబైల్ ఫోన్లు పంపిణీ చేశారు. అలాగే మినీ హెల్పర్ల నుంచి అప్గ్రేడ్ అయిన 88 మందికి ఉద్యోగోన్నతి పత్రాలను అందజేశారు. పలువురు చిన్నారులకు ప్రభుత్వం అందించిన మినీ కిట్స్ ను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి ప్రమీల, ఆర్డీవో సువర్ణ, డీఎస్పీ విజయ్ కుమార్ , పుట్టపర్తి రూరల్ ఎస్సై లింగన్న, ఐసిడిఎస్ సూపర్వైజర్లు ,కార్యకర్తలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి అంగన్వాడీల సమస్యలు : అంగన్వాడీ కార్యకర్తల డిమాండ్లను అసెంబ్లీలో ప్రస్తావించాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సీఎస్ శ్రీదేవి స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరను కోరారు. ఈ మేరకు ఆమె తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకురాలు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల క్రితం 42 రోజులు పాటు సమ్మెలో పాల్గొన్నప్పుడు అప్పటి ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం నాయకులు అధికారంలోకి రాగానే అంగన్వాడి సమస్యలను తీరుస్తామని మాట ఇచ్చారని గుర్తు చేశారు. అంగన్వాడీలు సంక్షేమ పథకాలను అనర్హులని ప్రకటించారని దాంతో వారికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని చెప్పారు. రేషన్ కార్డులు తొలగిపోతాయని, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అనర్హులవుతామని, దానివలన అంగన్వాడీ కుటుంబాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆ సమస్యను పరిష్కరించాలని కోరారు. అంతేకాక ఐదు సంవత్సరాల వరకు ప్రైవేటు పాఠశాలలో పిల్లలకు ప్రవేశం లేకుండా చేస్తే అంగన్వాడీ కేంద్రాలలో మూడు సంవత్సరాలు పాటు వారికి విద్యాబుద్ధులు నేర్పించే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఇందులకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకురాలు చాలుకూరు శ్రీదేవి ,నియోజకవర్గంలోని అంగన్వాడీ యూనియన్ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో పల్స్ పోలియోపై శిక్షణ

ప్రజాశక్తి - ముదిగుబ్బ

డిసెంబర్ 21 నుండి నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంపై స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిహెచ్ఓ అధ్యక్షతన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ పల్స్‌పోలియో విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి లక్ష్మీదేవి చంద్రాయుడు, పిహెచ్‌సి సిబ్బంది, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

22న జనసేన కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - బుక్కపట్నం

మండల కేంద్రంలో ఈనెల 22వ తేదీన జనసేన పార్టీ మండల నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆపార్టీ మండల కన్వీనర్ జయరాం, టౌన్ కన్వీనర్ శ్రీనివాసులు, జనసేన యువ నాయకుడు తోట అనిల్ కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్, రాష్ట్ర నాయకులు చిలకం మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ భవాని రవికుమార్, నియోజకవర్గ సమన్వయకర్త పత్తి చంద్రశేఖర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మన్సూర్, గణేష్, భాస్కర్, బోడబాటి సాయి, జబీబుల్లా తదితరులు పాల్గొన్నారు.

పాపసానపల్లి పాఠశాలలో విజ్ఞాన ప్రదర్శన

ప్రజాశక్తి మడకశిర రూరల్

మండల పరిధిలోని పాపసానపల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులు సైన్స్ ఫెయిర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ చేసిన నమూనాల గురించి విద్యార్థులు వివరించారు ఎనిమిదవ తరగతికి చెందిన అఖిలేష్ జగదీష్ చేసిన నమూనాలు ఆకర్షించాయి. వీరిని మండల స్థాయికి ఎంపిక చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు, హరికృష్ణ, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు



నమూనా ప్రదర్శిస్తున్న విద్యార్థి